రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, మే 11 : భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రతి ఒక్క రైతూ సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. భీమారం మండలంలోని జడ్పీ పాఠశాల ఆవరణతో పాటు, దాంపూర్ పాఠశాలలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. భీమారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 21లో మోక మీద ఉన్న రైతులకు పట్టాలు లేవని, లేనివారికి పట్టాలు ఉన్నాయని స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే చేసి అలాంటి పేర్లను తొలిగిస్తామన్నారు. తహశీల్దార్ మధుసూదన్, ఆర్ఐ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు లక్ష్యాలు పూర్తి చేయాలి



రంగంపెల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

దండేపల్లి, మే 11 : మిల్లర్లు తమకు కేటాయించిన వరి ధాన్యం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ సూచించారు. దండేపల్లి మండలం కన్నేపల్లిలోని శ్రీ వేంకటేశ్వర రైస్‌మిల్లు, రంగంపెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లోడును తక్షణమే దిగుమతి చేసుకొని, వాహనాలను వెంటనే తిరిగి పంపించాలన్నారు. సీఎంఆర్ లక్ష్యాల సాధన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భూమన్న, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు, ఐకేపీ సిబ్బంది, రైతులు, నిర్వాహకులున్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్ అమలు చేయాలి

మందమర్రి మార్కెట్‌లో బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకుల ర్యాలీ

మందమర్రి, మే 11 : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్‌ను అమలు చేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో 5న ప్రారంభించిన బీసీల మేలు కొలుపు యాత్ర ఆదివారం మందమర్రి పట్టణానికి చేరుకున్నది. స్థానిక నాయకులతో కలసి పాతబస్టాండ్, మార్కెట్ ఏరియాల్లో ర్యాలీ తీశారు. పలువురు వ్యాపారులను కలసి కరపత్రాలు పంపిణీ చేశారు. దేశ వ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వాటా అందించాలని డిమాండ్ చేస్తూ 'మేమెంతో మాకంత' నినాదంతో రథయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ రథయాత్రకు బీసీ సంఘం నాయకులు సకినాల శంకర్, కొండిల్ల శ్రీనివాస్, ముడారపు శేఖర్ స్వాగతం పలుకగా, వడ్డేపల్లి మనోహర్ అధ్యక్షత వహించారు. రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, జినుకల లక్ష్మణ్‌రావు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సుంకటి పోశెట్టి, గుమ్ముల శ్రీనివాస్, విద్యార్థి నాయకులు చేరాల వంశీ, నామని అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా కేంద్రానికి..

మంచిర్యాల (ఏసీసీ), మే 11 : బీసీ మేలు కొలుపు రథయాత్ర మంచిర్యాల జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు సరైన అవకాశాలు లేక, అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కర్రె లచ్చన్న, నీలకంఠేశ్వర్ గౌడ్, డా.రాజకిరణ్, గుమ్ముల శ్రీనివాస్, వైద్య భాస్కర్, ఎండీ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సామల సదాశివ్ మాస్టర్ జయంతి

సదాశివ్ మాస్టర్ విగ్రహం వద్ద వేడుకల్లో పద్మశాలీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్, మే 11: కాగజ్‌నగర్‌లోని బస్టాండ్ సమీపంలో సామల సదాశివ్ మాస్టర్ 98వ జయంతి వేడుకలను పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘ నాయకులు సామల రాజన్న, ఎన్నం అశోక్, కటుకం మధుకర్, మామిడాల తిరుపతయ్య, హనుమాండ్ల కేదారి, బోగ సత్యనారాయణ, ముదిగొండ సాంబయ్య, కుసుమ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాకర్స్ చేయూత

చెన్నూర్, మే 11 : చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం చేయూతనందించారు. పోషకాహారం అందించేందుకు గాను రూ.10 వేలు అందజేశారు. అలాగే క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కోచ్‌లు జంజర్ల సంతోష్, శ్రావణ్, గడిపెల్లి విజయ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ కారెంగుల రామయ్య, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మేకల రామస్వామి, గట్ల చందర్, ఖలీల్, బాపు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

శంకర్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

బొక్కలగుట్టలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన కార్యాలయం

అసంపూర్తిగా జీపీ భవనాలు

- నిలిచిపోయిన నిర్మాణాలు
- అదే భవనాల్లోనే కార్యాలయాలు
- ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు

మందమర్రి, మే 11 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పరిపాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యార్థం చిన్న గ్రామాలు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. ఇందులో భాగంగా మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి, పులిమడుగు, బొక్కలగుట్ట, ఆదిల్‌పేట గ్రామాలను నూతన జీపీలుగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు కొత్త భవనాలు నిర్మించాలని ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారు. అనంతరం పనులు చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికలు జరగడం.., కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నిధులు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం స్లాబు(పైకప్పు) వరకు పూర్తి కాగా, ఆదిల్‌పేట, పులిమడుగు, బొక్కలగుట్టలో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. దీంతో బొక్కలగుట్ట, శంక్‌పల్లి, పులిమడుగు గ్రామా పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆదిల్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో ఏర్పాటు చేశారు. అద్దె భవనాలతో పాటు పాఠశాల గదిలో సరైన సౌకర్యాలు లేక వివిధ పనులపై కార్యాలయాలకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాల పనులు నిలిచిపోయాయనే విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అద్దె భవనాల్లో సౌకర్యాలు లేక ప్రజలతో పాటు సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. జీపీ రికార్డులకు రక్షణ లేకుండా పోతున్నదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు జోక్యం చేసుకొని గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ ఇస్సాక్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు కావాల్సి ఉన్నదని తెలిపారు. ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే పనులు చేపడుతామని వివరించారు.

నత్తనడకన ఇందిరమ్మ మోడల్ హౌస్

మందమర్రిరూరల్, మే 11 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ముందుగా అన్ని మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో లబ్ధిదారుల అవగాహన కోసం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలు చేపట్టింది. మందమర్రి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మూడు నెలల క్రితం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం, తహసీల్ కార్యాలయం సమీపంలో, నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉన్న చోటే ఇంటి నిర్మాణ పనులు జాప్యమవుతుంటే గ్రామాల్లో మా పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా పూర్తి చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బన్సీలాల్‌ను వివరణ కోరగా వివిధ కారణాలతో పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనని, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రేపటిలోగా పనులు ప్రారంభించి త్వరలోనే ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పూర్తి చేస్తామని తెలిపారు.

మందమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఇందిరమ్మ మోడల్ హౌస్

సారు.. సక్సెస్

- కోటపల్లి ఎస్ఐ కృషి.. 'పది' ఫలితాల్లో ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల ప్రతిభ
- వంద శాతం ఉత్తీర్ణత

కోటపల్లి, మే 11 : కోటపల్లి ఎస్ఐ రాజేందర్ కృషి ఫలితంగా స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండే ఉద్యోగం చేస్తూనే.. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించి, ఉత్తమ ఫలితాలు రాబట్టారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుకొనే ఉద్యోగం సాధించారు. చదువుతోనే ప్రగతి సాధ్యమని, కష్టపడితే సాధించలేదని లేదని నమ్మి పేద విద్యార్థులు చదువు వైపు దృష్టిపెట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో ప్రతి రోజూ సాయంత్రం ఈ వసతి గృహాన్ని సందర్శిస్తూ విద్యార్థులను చదువువైపు ప్రోత్సహించారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వారికి స్నాక్స్‌తో పాటు, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తూ వెన్నుతట్టారు. పరీక్షలపై భయాన్ని తొలగించడంతో పాటు, ఉత్సహంగా పరీక్షలు రాసేందుకు తన అనుభవాలను చెప్తుండేవారు. ఏ విషయంలో సందేహాలున్నా తన అనుభవంతో పరిష్కరిస్తూ వారిలో ఉత్సాహం నింపిన ఈ ఎస్ఐ.. విద్యార్థుల పాలిట 'సార్..' అయ్యారు. ఇక్కడ చదివిన 23 మందికి 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా, సార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేందర్ (ఫైల్)

❖ సార్ కృషి వల్లే ఉత్తీర్ణులమయ్యాం..

"కోటపల్లి ఎస్ఐ సార్ కృషి వల్లే 100 శాతం ఉత్తీర్ణత సాధించాం. కోటపల్లి మోడల్ స్కూల్‌లో విద్యాబోధన అనంతరం హాస్టల్‌కు వచ్చిన తర్వాత చదవకుండా కాలక్షేపం చేసేవాళ్లం. కానీ మా హాస్టల్‌పై సార్ ప్రత్యేక దృష్టి పెట్టి, రోజూ సాయంత్రం సందర్శించేవారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పాఠాలు బోధించడం వల్ల సక్సెస్ అయ్యాం. పట్టుబట్టి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయనను చూసే నేర్చుకున్నాం. సూచనలు, సలహాలతో ఉన్నతంగా చదివి మంచి కొలువులు సాధిస్తాం."

- ఓంకార్, విద్యార్థి

❖ మంచి ఫలితాలు వచ్చాయి..

"పదో తరగతి విద్యార్థులపై కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అందువల్లే వారు మంచి ఫలితాలు సాధించాం. ప్రతిరోజూ మా వసతి గృహాన్ని ఎస్ఐ స్థాయి అధికారి సందర్శించడం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టారు. విద్యార్థులు చెడు వైపు పయణించకుండా ఆయన చేసిన కృషి అభినందనీయం. ఇలా ప్రతీ వసతి గృహాన్ని మండలస్థాయి అధికారులు దత్తత తీసుకుంటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. దీంతో పాటు, మంచి ఫలితాలు కూడా సాధించవచ్చు."

- మల్లేశ్, సంక్షేమాధికారి, ఎస్సీ హాస్టల్, కోటపల్లి

❖ విద్యతోనే ప్రగతి సాధ్యం..

"విద్యార్థి దశలో ముఖ్యమైన దశ పదోతరగతి. ఈ దశలో విద్యార్థులు సన్మార్గంలో నడిస్తేనే ప్రయోజకులవుతారు. విద్యతోనే ప్రగతి సాధ్యం. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడితే అద్భుతాలు సాధించవచ్చు. నేనూ వసతి గృహంలో ఉంటూనే చదవుకొని ఈ స్థాయిలో ఉన్నా. కోటపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంపై ప్రత్యేక దృష్టి పెట్టా. మా ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతూ విద్యార్థులను పది పరీక్షలకు సన్నద్ధం చేసి విజయం సాధించా."

- రాజేందర్, ఎస్ఐ, కోటపల్లి

టీజీ ఈఏపీసెట్ ఫలితాల్లో ప్రతిభ

శ్రీరాంచరణ్

అభిషేక్

గుజ్జుల సిరికుందన

నస్పూర్, మే 11 : టీజీ ఈఏపీసెట్ ఫలితాలు ఆదివారం వెలువడగా, మంచిర్యాల అల్ఫోర్స్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. విద్యార్థి కే శ్రీరాంచరణ్ 732 ర్యాంక్ సాధించాడు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన ఈ విద్యార్థిని కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

దండేపల్లి, మే 11 : దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన కుమారస్వామి-భాగ్యవతి కొడుకు తుమ్మ అభిషేక్ ప్రతిభ చూపాడు. ఎంపీసీ గ్రూపులో అభిషేక్ 2,245 ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు.

కాసిపేట, మే 11 : బెల్లంపల్లి మండలం సోమగూడెం భరత్ కాలనీకి చెందిన గుజ్జుల సిరికుంద 405వ ర్యాంక్ సాధించింది. గుజ్జుల రాజేంద్ర ప్రసాద్-రజిత దంపతుల కూతురు సిరికుందన అగ్రికల్చర్, ఫార్మసీలో ప్రతిభ చూపింది. ఇంటర్‌లో సైతం రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించింది. తండ్రి రాజేంద్ర ప్రసాద్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

శిక్షణ పకడ్బందీగా నిర్వహించాలి

నస్పూర్, మే 11 : వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ చౌదరి తెలిపారు. మంగళవారం నుంచి ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణపై డీఈవో కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు శిక్షణను సద్వినియోగం చేసుకునేలా రీసోర్స్ పర్సన్‌లు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన 1811 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1130 మంది ఎస్‌జీటీలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేశ్, వామనమూర్తి, రామన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

బెజ్జూర్, మే 11 : చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కుమ్రం భీం విగ్రహావిష్కరణకు బెజ్జూర్ మండల ఆదివాసీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆదివాసీ బెజ్జూర్ మండలాధ్యక్షుడు కోర్తె తిరుపతి పిలుపునిచ్చారు. ఆదివారం బెజ్జూర్‌లోని ఆదివాసీ భవనంలో మాట్లాడారు. మండల ఆదివాసీ సంఘం గౌరవాధ్యక్షుడు సిడాం సకారాం, మహిళా అధ్యక్షురాలు ఏన్క అమృత, మండల ప్రధాన కార్యదర్శి పొర్తెటి పద్మ, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్, ఆదివాసీ నాయకులు ఏన్క శ్రీహరి, పుల్లయ్య, రాము పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

మందమర్రి, మే 11 : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. స్థానిక సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ ఆలీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ వ్యాపార వర్గాలకు అనుకూలంగా చేసిన 4 కోడ్‌ల సవరణను వ్యతిరేకిస్తూ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. 44 చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, 4 కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి పౌల్, ముస్కె సమ్మయ్య, ఖలీందర్ అలీ ఖాన్, తోకల సరస్వతి, దాగం మల్లేశ్, సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, దేనబోయిన బాపు, జాడి పోశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

రెబ్బెన, మే 11 : రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటించనున్నట్లు నాయకులు ఆదివారం తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తారని వివరించారు.

వందేండ్లు నిండిన వృద్ధురాలికి పుట్టిన రోజు

జైనథ్, మే 11: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ముక్తాపూర్ గ్రామంలో 100 ఏండ్లు పూర్తి చేసుకున్న వృద్ధురాలికి పుట్టిన రోజు, మాతృ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ముక్తాపూర్ గ్రామానికి చెందిన బుర్రి సుందరబాయి భర్త బుర్రి ఆశన్న దంపతులకు ఐదుగురు కూతుళ్లు. కాగా, వారితో పాటు, ఐదుగురు అల్లుండ్లు, మనవరాళ్లు కలిసి కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి సంబురాలు జరుపుకున్నారు.

చుక్కల దుప్పిని కాపాడిన అధికారులు

చుక్కల దుప్పికి నీళ్లు తాగిస్తున్న అటవీ సిబ్బంది

కౌటాల, మే 11: సిర్పూర్ (టీ) మండలంలోని ఆదివారం చీలపెల్లిలో ఊర కుక్కలు చుక్కల దుప్పిని వెంబడించగా ఓ ఇంట్లోకి వెళ్లగా ఆ ఇంటి యజమాని దాన్ని కాపాడి అటవీ అధికారులకు అప్పగించాడు. వెంటనే సిర్పూర్ రేంజీ అధికారి ఇక్బాల్ తో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని దుప్పికి నీళ్లు తాగించి అడవిలోకి సురక్షితంగా వదిలి పెట్టారు. వేసవి ఎండల్లో తాగునీటి కోసం అటవీ జంతువులు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. వన్య ప్రాణులకు హాని కలిగించిన వారిపై చట్టరీతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఎస్వో మోహన్‌రావు, ఎఫ్‌బీవోలు సంతోష్, అరవింద్, అరుణ్ రెడ్డి, వాచర్లు శ్యామ్‌రావు, ఇర్ఫాన్, సంజు, గణపతి, రవి ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

కాసిపేట, మే 11 : కాసిపేట మండలం సోమగేడెం ట్యాంక్ బస్తీకి చెందిన గోపె సందీప్ (40) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గోపె సందీప్‌కి 2914లో పెండ్లి జరుగగా, పదేళ్ల కూతురు ఉన్నది. భార్యతో విబేధాలు రావడంతో పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెంది మద్యం మత్తులో గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వడ దెబ్బతో యువకుడి మృతి

గొంతయ్య (ఫైల్)

పెంచికల్ పేట్, మే 11 : వడదెబ్బతో యువకుడు మృతి చెందిన ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లిలో జరిగింది. ఎస్ఐ కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన మానేపల్లి సత్తయ్య బుజ్జి దంపతుల కుమారుడు మానేపల్లి గొంతయ్య (19) శనివారం ఉదయం వరి పంట నూర్పిడి చేసేందుకు పొలానికి వెళ్లాడు. 10 గంటలకు ఇంటికి వచ్చాక ఒక్కసారిగా అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు స్థానిక ఆర్ఎంపీ వద్ద చూపించగా అతడు ఓఆర్ఎస్ ఇచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో పడుకొని ఉన్న గొంతయ్యను కుటుంబ సభ్యులు లేపగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. వడదెబ్బతో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

పురుగుల మందు తాగి బాలిక..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 11: పురుగుల మందు తాగి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆసిఫాబాద్ మండలంలోని భాగ్యనగర్ కాలనీలో ఆదివారం జరిగింది. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన బాలిక(17)ను తల్లిదండ్రులు పనులకు తీసుకువెళ్లడానికి ప్రయత్నించగా కొంత కాలంగా నిరాకరిస్తున్నది. ఇదే క్రమంలో ఆదివారం పనికి వెళ్లాలని తల్లి అనడంతో మనస్తాపానికి గురైన బాలిక పురుగుల మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందన్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 11: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ సమీపంలోని హీన జిన్నింగ్ మిల్లు వద్ద జరిగింది. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అబ్దుల్లా బిన్‌సాలే(42) ఆదివారం పని నిమిత్తం ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ వెళ్తున్నాడు. జిన్నింగ్ సమీపంలోని మూల వద్ద డివైడర్‌ను ఢీ కొనడంతో కారు బోల్తా పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు ఆడలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడని, భార్య ఆస్మ బేగం, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

వాంకిడి,మే 11 : పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టర్ ద్వారా వాంకిడి పోలీసులు ఆచూకీ కనుగొని ఆదివారం బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, వాంకిడి మండలంలోని బంబార, కోమటిగూడ గ్రామాలకు చెందిన బిక్కు, వీనేశ్ చరవాణిలను పోగొట్టుకున్నారు. అదే రోజు వాంకిడి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ వివరాలు నమోదు చేసి, ఆచూకీ కనుగొని వాటిని స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఫోన్ పోత